• శ్రీరాముడి అవతారంలో లక్ష్మీనరసింహుడి దర్శనం




యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో స్వామివారి అధ్యయనోత్సవాలు ఆగమశాస్త్రం ప్రకారం వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా యాదగిరీశుడు సోమవారం ఉదయం శ్రీరాముడు, సాయంత్రం వేంకటేశ్వరుడి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరువీధుల్లో స్వామివారి అలంకార సేవలు నిర్వహించారు. వరుస సెలవులు రావడంతో యాదగిరిగుట్టకు భక్తులు పోటెత్తారు. -యాదగిరిగుట్ట

• వేములవాడ క్షేత్రం.. భక్తజన సంద్రం



వేములవాడ రాజన్న క్షేత్రం సోమవారం భక్తజనసంద్రమైనది. పవిత్ర ధర్మగుండంలో భక్తులు స్నానాలు ఆచరించి, కల్యాణకట్టలో తలనీలాలను సమర్పించుకున్నారు. స్వామివారిని దాదాపు 80 వేలకుపైగా భక్తులు దర్శించుకోగా.. రూ.35 లక్షలకుపైగా ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో కృష్ణప్రసాద్ వెల్లడించారు. అనుబంధ దేవాలయాలైన శ్రీ భీమేశ్వరాలయం, బద్ది పోచమ్మ, నగరేశ్వరాలయాలు, క్షేత్ర ప్రధాన వీధులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. -వేములవాడ టౌన్

## లోకం పోకడ




## రేషన్‌కార్డు లేనోళ్ల.. దరఖాస్తులెట్ల?

▸ మొదటిపేజీ తరువాయి...

ఎన్నో ఉన్నాయి. ఆయా కార్డుల్లో వాళ్ల భార్యా పిల్లల పేర్లు కూడా ఎక్కని పరిస్థితి. వాస్తవానికి వారు ప్రత్యేకంగా కుటుంబంగా ఏర్పడ్డారు కాబట్టి.. ప్రభుత్వం అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకొనేందుకు వారు అర్హులు. కానీ రేషన్‌కార్డు లేకపోవడం వల్ల వారు కొత్తగా దరఖాస్తు చేసుకొనే అవకాశాన్ని కోల్పోనున్నారు. మరోవైపు రాష్ట్రంలో సుమారు 10 లక్షల రేషన్ కార్డుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు అధికారులు చెప్తున్నారు. ఇంకా దరఖాస్తు చేయనివారు 2 లక్షల మందిగా అంచనా వేసుకొంటే.. సుమారు 12 లక్షల కుటుంబాలు ఉంటాయి. వీరంతా ఇప్పుడు ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకోవచ్చా? లేదా? అనేది ఇప్పటివరకు అటు ప్రభుత్వం నుంచి గానీ, ఇటు అధికారులనుంచి గానీ స్పష్టత రావడంలేదు. ఒకవేళ కార్డు లేని వారు దరఖాస్తు చేసుకొంటే వాటిని పరిగణనలోకి తీసుకొంటారా? లేదా? అనే విషయంలోనూ గందరగోళం నెలకొన్నది.

### కార్డుల్లో మార్పులు.. మరి కొత్తవి ఎప్పుడు?

ప్రస్తుతం రాష్ట్ర జనాభాలో సుమారు 80 శాతానికిపైగా మందికి రేషన్ కార్డులు ఉన్నాయని, వాటిని క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉన్నదని ఇటీవల అసెంబ్లీలో ప్రభుత్వం పేర్కొన్నది. కార్డుదారుల్లో బియ్యం తీసుకుంటున్న వారి సంఖ్య 80 శాతం మాత్రమే ఉన్నదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రేషన్‌కార్డుల క్రమబద్ధీకరణ జరుగుతుందని ప్రచారం మొదలైంది. ఒకవేళ అదే నిజమైతే ముందుగా కార్డులను క్రమబద్ధీకరిస్తారా? లేదా ప్రజాపాలనలో దరఖాస్తులకు పథకాలు మంజూరు చేస్తారా? అనే విషయంలోనూ ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. ఒకవేళ క్రమబద్ధీకరించకుండా పథకాలు మంజూరు చేస్తే మళ్లీ కొంత మేర అనర్హులకే దక్కినట్టు అవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు.. పెండింగ్‌లో ఉన్న 10 లక్షల దరఖాస్తులను పరిశీలించి, కొత్త కార్డులు మంజూరు చేస్తారని కొందరు చెప్తుండగా, మరికొందరు కొత్తగా దరఖాస్తు ప్రక్రియ చేపడతారని అంటున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే దరఖాస్తులను ఎప్పటిలోగా పరిశీలించి, కొత్తకార్డులు ఇస్తారనేదానిపైనా స్పష్టత కరువైంది. కొత్తగా రేషన్‌కార్డు ఇచ్చిన తర్వాతే మళ్లీ ఆరు గ్యారెంటీలకు అర్హులవుతారు కాబట్టి ప్రభుత్వం వెంటనే ఈ అంశంపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

# 3 నుంచి బీఆర్‌ఎస్ సమీక్షలు



తెలంగాణభవన్‌లో సోమవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్

▸ మొదటిపేజీ తరువాయి...

చర్చించనున్నారు. సోమవారం తెలంగాణభవన్‌లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ముఖ్యనేతలతో ఆయన సమావేశమయ్యారు. మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, కాలే యాదయ్య, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండా ఎగురవేసేందుకు పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఈసారి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎంపీ జీ రంజిత్‌రెడ్డికే టికెట్ ఇవ్వనున్నట్టు కేటీఆర్ పార్టీ ముఖ్య నాయకులకు చెప్పినట్టు సమాచారం. సమావేశం ముగిసిన తరువాత ఇదే విషయాన్ని ఎంపీ రంజిత్‌రెడ్డి సహా పలువురు నేతలు ధ్రువీకరించారు.

### నిరాశ చెందాల్సిన పనిలేదు

రాష్ట్రంలో అధికారం చేపట్టకపోయినంత మాత్రాన, ఎమ్మెల్యే అభ్యర్థులు ఓడిపోయినంత మాత్రాన పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరాశచెందాల్సిన పనిలేదని కేటీఆర్ గులాబీ శ్రేణులకు చెప్పారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని పేర్కొన్నారు. పదేండ్లపాటు ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని, అదృష్టాన్ని ఇస్తే అద్భుతాలు సృష్టించామని తెలిపారు. పార్టీలో అన్ని స్థాయిల్లో ఓటమికి కారణాలను విశ్లేషించుకొని ప్రజాభీష్టం మేరకు పార్టీ నడుచుకునే రీతిలో కార్యాచరణ ఉంటుందనే విశ్వాసాన్ని పార్టీ శ్రేణులకు కల్పించారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ, ఎవరికివారు ద్విగుణీకృత ఉత్సాహంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు పరిశీలించి, అక్కడక్కడ ఉన్న గ్యాప్‌ను పూడ్చుకోవాలని సూచించారు. చేసిన తప్పులు తిరిగి చేయకుండా, అన్నిస్థాయిల నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా సమావేశాలు నిర్వహించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులే ఇన్‌చార్జీలుగా ఉంటారని పేర్కొన్నట్టు తెలిసింది.

**చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్లు**

| | |
|---|---|
| బీఆర్‌ఎస్ | 7,06,578 |
| కాంగ్రెస్ | 6,07,693 |
| బీజేపీ | 3,34,628 |

బీఆర్‌ఎస్ ఆధిక్యం: 98,885

### బీఆర్‌ఎస్‌కు లక్ష ఓట్లు ఆధిక్యం

గత అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్‌కు దాదాపు లక్ష ఓట్ల ఆధిక్యం లభించింది. చేవెళ్ల పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకర్గాలు ఉండగా, నాలుగు చోట్ల బీఆర్‌ఎస్, మూడు చోట్ల కాంగ్రెస్ విజయం సాధించాయి. తాండూరు, పరిగి, వికారాబాద్‌లో కాంగ్రెస్ గెలుపొందగా, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలిచారు. మహేశ్వరం, రాజేంద్రనగర్ మినహా మిగిలిన ఐదు చోట్ల బీజేపీ తృతీయ స్థానానికే పరిమితమైంది.

### స్పష్టమైన వ్యూహంతో ముందుకు: ఎంపీ రంజిత్‌రెడ్డి

**చేవెళ్ల** లోక్‌సభ నియోజకవర్గంలో గెలుపు కోసం స్పష్టమైన వ్యూహంతో ముందుకు సాగుతామని ఎంపీ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. కేటీఆర్‌తో సమావేశమైన తరువాత తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల నుంచి తనకే టికెట్ ఇవ్వాలని పార్టీ నిర్ణయించిందని చెప్పారు. గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు 412 హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు ఒక్కటై బీఆర్‌ఎస్‌పై పదే పదే అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లను సవరించుకొని తిరిగి ప్రజా ఆశీర్వాదం పొందుతామని చెప్పారు.

## అక్రమంగా చెట్ల నరికివేత, స్మగ్లింగ్

• కర్ణాటక బీజేపీ ఎంపీ సోదరుడిపై కేసు

బెంగళూరు: పార్లమెంటు భద్రతా వైఫల్యం ఘటనతో ఇరుకునపడ్డ బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన సోదరుడు విక్రమ్ సింహాపై అటవీ శాఖ కేసు నమోదు చేసింది. కర్ణాటకలోని హసన్ జిల్లా, నందగొండనహళ్లి గ్రామంలో అనుమతి లేకుండా 120 చెట్లను నరికేసి, అక్రమంగా రవాణా చేసినట్లు ఆరోపించింది. తహశీల్దారు మమత ఈ ప్రాంతంలో పర్యటించినపుడు చెట్ల నరికివేతను గుర్తించి, తమకు సమాచారం ఇచ్చారని తెలిపింది. పశువుల మేత కోసం ఉద్దేశించిన 12 ఎకరాల విస్తీర్ణం గల ప్రభుత్వ భూమిలో ఈ చెట్లు ఉన్నట్లు తెలిపింది. కర్ణాటక అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖంద్రే మాట్లాడుతూ, విక్రమ్ సింహా 15 రోజుల నుంచి ఈ చెట్లను నరికిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఆయనపై చర్యలు తీసుకుంటామన్నారు.

## ఈవీఎంలతో జరిపే ఎన్నికలను బాయ్‌కాట్ చేయాలి

కాంగ్రెస్ నేత, రాహుల్ సన్నిహితుడు శ్యామ్ పిట్రోడా

న్యూఢిల్లీ, డిసెంబర్ 25: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సన్నిహితుడు, ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ చైర్మన్ శ్యామ్ పిట్రోడా ఈవీఎంల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తారు. వాటిని ఎలా నియంత్రించవచ్చో అంతర్జాతీయ నిపుణులతో కలిసి త్వరలోనే ప్రదర్శన నిర్వహిస్తానన్నారు. ఈవీలంకు వ్యతిరేకంగా నిరసనలు తెలపాలని రాజకీయ పార్టీలను కోరారు. ఈవీఎంలతో జరిపే ఎన్నికలను బహిష్కరించడంపై పార్టీలు ఆలోచించాలని, ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయొచ్చనే అనుమానం ఉందని చెప్పారు.

## 1,600 మంది ఒకేసారి.. తబలా వాయించి గిన్నిస్ రికార్డు

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ కోటలో ఉన్న తబలా దర్బార్‌లో సోమవారం ఏకకాలంలో 1,600 మంది తబలా వాయించి గిన్నిస్ ప్రపంచ రికార్డు సృష్టించారు. గ్వాలియర్ వార్షిక సంగీత ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ కోటను నిర్మించిన రాజా మాన్ సింగ్ గొప్పతనంతోపాటు సాంస్కృతిక చరిత్ర ఘనతను చాటే విధంగా ఈ కార్యక్రమం జరిగిన కర్ణ మహల్‌ను అలంకరించారు. ఉష్ణోగ్రత 6 నుంచి 7 డిగ్రీల సెల్సియస్ ఉన్న సమయంలో ఆరు బయట తబలా వాయించడం చాలా కష్టం అయినప్పటికీ, వాద్యకారులు నిరాశ చెందకుండా, ప్రపంచ రికార్డును సృష్టించడం ప్రశంసనీయం.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 9.2°c | 29.3°c |
| రంగారెడ్డి | 10.6°c | 32.5°c |
| మెదక్ | 12.3°c | 32.6°c |
| కరీంనగర్ | 15.0°c | 29.0°c |
| నిజామాబాద్ | 15.1°c | 30.3 °c |
| మహబూబ్‌నగర్ | 15.2°c | 31.0°c |
| హైదరాబాద్ | 15.5°c | 29.3°c |
| వరంగల్ | 17.0°c | 29.0°c |
| ఖమ్మం | 17.0°c | 30.0°c |
| నల్లగొండ | 18.0°c | 29.0°c |

# పురుషులకు ప్రత్యేకం

▸ మొదటిపేజీ తరువాయి...

భావిస్తున్నది. ఈ మేరకు పురుషులకు ప్రత్యేక సీట్ల ఆలోచనకు తెరలేపింది.



### డిపోల వారీగా అభిప్రాయాల సేకరణ

ప్రతీ బస్సులోనూ మొత్తం 55 సీట్లలో 20 సీట్లు పురుషులకు రిజర్వ్ చేసే అంశాన్ని ఆర్టీసీ ఉన్నతాధికారులు తీవ్రంగా పరిశీలిస్తున్నారు. ఈ మేరకు అన్ని డిపోల నుంచి వివరాలు పంపాలని కోరుతూ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా డిపో మేనేజర్ల అభిప్రాయాలనూ తప్పనిసరిగా తెలుసుకోనున్నారు. డిపోల వారీగా నివేదికలు వచ్చాక పురుషులకు రిజర్వ్‌డ్ సీట్ల అంశంపై టీఎస్‌ఆర్టీసీ సంస్థ నిర్ణయం తీసుకోనున్నది. దీంతో ఒకప్పుడు మహిళలకు కేటాయించినట్టుగానే ఇప్పుడు పురుషులకు బస్సుల్లో రిజర్వ్ సీట్లు కేటాయించే అంశంపై చర్చనీయాంశంగా మారింది.

### దేశ చరిత్రలోనే వినూత్నం

రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో పురుషులకు ప్రత్యేక సీట్లు కేటాయిస్తే ఇది దేశంలో వినూత్న అంశంగా నిలువనున్నది. అయితే ఈ విషయంపై ఏమైనా వ్యతిరేకత వస్తుందా.. లేదా.. అన్ని మీమాంస అధికారుల్లో నెలకొన్నది. ఎందుకంటే దేశంలో ఇప్పటి వరకూ మహిళలకే తప్ప పురుషులకు ఇలా సీట్లు రిజర్వ్ చేసిన దాఖలాలు ఎక్కడా లేవు.

### కాంగ్రెస్ ప్రభుత్వం తొలి గ్యారెంటీగా అమలు

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణ పథకం ఒకటి. ఆ పార్టీ అధికారంలోకి వచ్చాక తొలుత అమలు చేసిన రెండింటిలో ఇది ఒకటి. రాష్ట్రంలో మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించింది. స్థానికత కోసం గుర్తింపు కార్డు చూపితే కండక్టర్లు జీరో టికెట్ జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో విపరీతమైన రద్దీ పెరిగింది. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు సైతం నిల్చొని ప్రయాణించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రయాణికుల నుంచి పెద్ద ఎత్తున వినతలు వస్తుండటంతో పురుషుల సీట్ల రిజర్వ్‌పై ఆర్టీసీ యోచిస్తున్నది.

### పలుచోట్ల పురుషుల నిరసనలు

**ఆర్టీసీ** బస్సుల్లో సీట్లు దొరకకపోవడంతో పలుచోట్ల పురుషులు నిరసనలు తెలిపిన ఘటనలు చోటుచేసుకొన్నాయి. బస్సుల్లో మహిళలతోనే సీట్లు నిండిపోవడంతో పలువురు పురుషులు ఇటీవల హైదరాబాద్‌లోని మెహిదీపట్నం బస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేశారు. కనీసం 15 శాతం సీట్లు పురుషులకు కేటాయించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తనకు సీటు లేదని నిజామాబాద్ జిల్లా ఆర్మూరులో ఏకంగా ఓ యువకుడు ఆర్టీసీ బస్సుకు అడ్డంగా కూర్చొని చాలాసేపు నిరసన తెలిపాడు. తోటి ప్రయాణికులు సర్దిచెప్పాక ఆ యువకుడు శాంతించాడు.

# కాంగ్రెస్ డీఎన్‌ఏలోనే హిందూ వ్యతిరేకత

- కాంగ్రెస్ అంటేనే మోసం, మభ్యపెట్టడం
- సనాతన ధర్మాన్ని అవమానించడంపై రాహుల్‌గాంధీ స్పందనేది?
- హిందూ వ్యతిరేకి కానని చెప్పగలరా?
- హామీల అమలుకు సమయమిస్తాం
- నెరవేర్చకపోతే పోరాడి తీరుతాం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టీకరణ



హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): హిందువుల పట్ల ద్వేషభావంతో వ్యవహరించేవారిని కాంగ్రెస్ వెనకేసుకొస్తున్నదని, ఆ పార్టీ డీఎన్‌ఏలోనే హిందూ వ్యతిరేక ధోరణి ఉన్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. 'ఇండియా' కూటమిలో భాగస్వామిగా ఉన్న డీఎంకే నేతలు హిందువుల మనోభావాలు దెబ్బతినేలా సనాతన ధర్మాన్ని, వలస కార్మికులను అవమానిస్తున్నప్పుడు, హిందీ మాట్లాడే రాష్ట్రాలను గోమూత్ర రాష్ట్రాలంటూ అవహేళన చేసినప్పుడు ఆ కూటమిలో పెద్దన్న పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎందుకు స్పందించడంలేదని నిలదీశారు. డీఎంకే నేతల వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని, హిజాబ్ వివాదంపై కూడా రాహుల్ తన వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అంటేనే మోసం, కుట్ర, మభ్యపెట్టడం అని కవిత విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు కొంత సమయం ఇస్తామని, చెప్పిన గడువులోగా ఆ హామీలను నెరవేర్చకపోతే కచ్చితంగా పోరాటం చేస్తామని తేల్చిచెప్పారు. సోమవారం ఆమె హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ మిత్రపక్షమైన డీఎంకే నాయకులు తమిళనాడులో కొన్ని వర్గాల ఓట్లను దండుకునేందుకు దేశాన్ని విచ్ఛిన్నం చేసేలా విద్వేష వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాన్ని ఐక్యం చేయడానికి భారత్ జోడో యాత్ర చేశానని చెప్తున్న రాహుల్ గాంధీ తమ మిత్రపక్ష నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

### కాంగ్రెస్ జవాబుదారీగా ఉండాలి

ఎన్నికలప్పుడే పనిచేసే రాహుల్ గాంధీని అందరూ 'ఎన్నికల గాంధీ' అని పిలుస్తున్నారని కవిత ఎద్దేవా చేశారు. డీఎంకే నేతల వ్యాఖ్యలపై మౌనం వహించడం ద్వారా దేశానికి రాహుల్ ఏం సందేశమిస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయమై దేశ ప్రజలకు ఆయన సమాధానం చెప్పాలని, ఇండియా కూటమికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ దేశానికి జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల తనకు గౌరవం ఉన్నదని, హిందీ మాట్లాడే రాష్ట్రాలను అవమానించరాదని, హిందూ వ్యతిరేకికానని రాహుల్ గాంధీ చెప్పగలరా? అని ఆమె నిలదీశారు.

### హిజాబ్‌పై కాంగ్రెస్ వైఖరేంటి?

ఎన్నికల హామీలను అమలు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి లేదని కవిత విమర్శించారు. గ్యారెంటీల పేరిట కర్ణాటక ప్రజలకు ఇచ్చిన పలు హామీలను కాంగ్రెస్ ఇప్పటికీ పూర్తిగా అమలు చేయలేదని గుర్తుచేశారు. హిజాబ్‌పై నిషేధాన్ని ఎత్తివేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో అధికారాన్ని చేపట్టి 8 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ నిషేధం ఎత్తివేతకు వెనుకాడుతున్నదని ఆమె తప్పుబట్టారు.

## 63కు చేరిన జేఎన్.1 కేసులు

- దేశంలో ఒక్కరోజే 628 కొత్త కేసులు
- 4054కు చేరిన మొత్తం యాక్టివ్ కేసులు
- రాష్ట్రంలో 24 గంటల్లో 10 కొవిడ్ కేసులు
- రాష్ట్రంలో జేఎన్.1 ఒక్క కేసూ నమోదు కాలేదన్న వైద్యశాఖ

న్యూఢిల్లీ/హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా కొవిడ్-19 ఉప రకం జేఎన్.1 కేసులు పెరుగుతున్నాయి. ఆదివారం వరకు దేశవ్యాప్తంగా ఈ తరహా కేసులు 63 నమోదయ్యాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్రం, రాష్ట్రాల ప్రభుత్వాలు కోరాయి. దేశంలో సోమవారం 628 తాజా కరోనా కేసులు నమోదయ్యాయని.. యాక్టివ్ కేసుల సంఖ్య 4,054కు చేరుకుందని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. కరోనాతో కేరళలో ఒకరు చనిపోయారు. కొద్ది వారాలుగా కరోనా కేసుల్లో పెరుగుదల కనిపిస్తున్నది. అయితే దవాఖానలో చేరి చికిత్స పొందతున్నవారి సంఖ్య తక్కువగానే ఉన్నది.

### కొత్తగా 10 కరోనా కేసులు

రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతున్నాయి. సోమవారం 10 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో 9, కరీంనగర్‌లో ఒక కేసు నమోదైనట్టు వైద్యారోగ్య శాఖ బులెటిన్ విడుదల చేసింది. మొత్తం 989 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్టు తెలిపింది. దీంతో రాష్ట్రంలో యాక్టివ్ కేసుల సంఖ్య 55కు చేరిందని చెప్పింది. మరో 12 మంది రిపోర్టులు రావాల్సి ఉన్నదని పేర్కొన్నది. ఆదివారం 8 కేసులు నమోదైనట్టు వివరించింది. భయపడాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉంటే సరిపోతుందని సూచించింది.

### ఒకే ఇంట్లో ఐదుగురికి..

జయశంకర్ భూపాలపల్లి గణపురం మండలం గాంధీనగర్‌లో ఓ వృద్ధురాలి కుటుంబంలోని ఐదుగురికి కరోనా పాజిటివ్ వచ్చింది. వృద్ధురాలు వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతుండగా, మిగతా నలుగురిని హోంఐసొలేషన్‌లో ఉంచామని, వారు కోలుకుంటున్నారని, ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

## నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

### ఐబీలో 226 ఖాళీలు

**కేంద్ర గృహ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇంటలిజెన్స్ బ్యూరో (ఐబీ)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 226
- పోస్టులు: అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్
- విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 12
- వెబ్‌సైట్: https://www.mha.gov.in/en

### ఐఎంయూలో...

**ఇండియన్ మారిటైం యూనివర్సిటీలో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 16
- పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్
- విభాగాలు: నాటికల్ సైన్స్, మెరైన్ ఇంజినీరింగ్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 24
- వెబ్‌సైట్: https://www.imu.edu.in

### సీపెట్‌లో..

**సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 9
- పోస్టులు: అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్, అసిస్టెంట్ ప్లేస్‌మెంట్ కన్సల్టెంట్
- సబ్జెక్టులు: ఇంగ్లిష్, మ్యాథ్స్, ప్లాస్టిక్ టెక్నాలజీ తదితరాలు
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 24
- వెబ్‌సైట్: www.cipet.gov.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- జనరల్ సైన్స్, జాగ్రఫీ, జనరల్ స్టడీస్ (గ్రూప్స్) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.